క్లుప్తంగా

గ్రీవెన్స్‌డేలో వినతుల వెల్లువ


తహసీల్దారుకు వినతులు ఇస్తున్న అర్జీదారులు

బుచ్చినాయుడుకండ్రిగ: తహసీల్దారు కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ డే నిర్వహించారు. రెండు నెలల తర్వాత నూతన తహసీల్దారు రావడంతో అర్జీదారులు బారులు తీరారు. పలు సమస్యలపై తహసీల్దారు టీవీ సుబ్రహ్మణ్యంకు వినతులను అందజేశారు. బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన రంగయ్య ఇంటి స్థలం, పక్కాగృహం మంజూరు చేయాలని, ఆలత్తూరుకు చెందిన వెంకటేశ్వర్లు భూసమస్యలను పరిష్కరించాలని, భూమి కొనుగోలుకు సంబంధించి పాసు పుస్తకాలు ఇవ్వాలని, ఆధార్ కార్డులో తప్పులను సరిచేసుకోవడానికి, ఓబీసీ సర్టిఫికెట్ల కోసం, భూముల సర్వే చేయాలని వినతులను అందజేశారు. వినతులను వీఆర్‌ఓలకు ఇచ్చి పరిష్కరించాలని తహసీల్దారు ఆదేశించారు.

నువ్వుల సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సత్యవేడు: నువ్వులు వైఎల్‌ఎం–66 రకం విత్తనాలతో సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు తిరుమల రెడ్డి, భారతి తెలిపారు. సోమవారం మండలంలో ఏఎంపురం సచివాలయ పరిధిలోని రైతులకు వైఎల్‌ఎం 66 నూతన వంగడం నువ్వుల సాగుపై అవగాహన కల్పించారు. 42 మంది రైతులకు విత్తనాలు ఉచితంగా అందజేశారు. వెంకటరాజుల కండ్రిగలో సాగు చేస్తున్న నువ్వుల పంటలను పరిశీలించారు. ఎకరాలకు రెండు కేజీల విత్తనంతో 4 నుంచి 5 క్వింటాళ్లు దిగుబడి పొందవచ్చన్నారు. వరి కోతల తరువాత పొలాలను రైతులు బీళ్లుగా వదిలేయకుండా దుక్కి దున్ని అదే తేమతో వైఎల్‌ఎం రకం నువ్వుల విత్తనాలు చల్లడం వల్ల పంటసాగుతో అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మురళి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు స్వర్ణ, మురళి, రైతులు పాల్గొన్నారు.

రేణిగుంటలో వర్షం

రేణిగుంట: రేణిగుంటలో సోమవారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. అప్పటి వరకు విపరీతమైన ఎండ కాసి, ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై దాదాపు 2 గంటల పాటు జోరుగా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో నిండిపోయాయి. వేసవితాపంలో అల్లాడిన జనం వర్షానికి ఉపశమనం పొందారు.

ఇళ్ల వద్దకే రేషన్ అందేలా చూస్తాం


తారకరామానగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ నేత శ్రీనివాసులురెడ్డి

రేణిగుంట: రేషన్ కార్డుదారులందరికీ ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేసేలా రెవెన్యూ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తారకరామానగర్ ఇన్‌చార్జి మన్యం శ్రీనివాసులురెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని తారకరామానగర్‌లో సోమవారం ఆయన ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. కొందరు తమకు రేషన్‌కార్డులు లేవని, మరి కొందరు స్టోర్ దగ్గరకు వెళ్లి రేషన్ తెచ్చుకోవడానికి ఇబ్బందిగా ఉందని చెప్పడంతో ఆయన పైవిధంగా స్పందించారు. మిట్ట ప్రాంతంలోని మరి కొన్ని వీధుల్లో కూడా తాగునీటి కొళాయిలను ఏర్పాటు చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన మహిళలకు చెప్పారు.

ఉపాధి కూలీలకు పనిముట్లు పంపిణీ


ఉపాధి కూలీలకు పనిముట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గంగారి రమేష్

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు సోమవారం సర్పంచ్ గంగారి రమేష్ తన సొంత నిధులతో గడ్డపారలు, పారలు, తట్టలు, బుట్టలు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అలాగే కూలీలకు ఎండ నుంచి ఉపశమనం కోసం పని వద్ద టెంటు ఏర్పాటు చేసుకునేందుకు టార్పాలిన్ పట్టలను పంపిణీ చేశారు. దీంతో కూలీలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ జ్యోతిశ్రీ, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

శ్రీకాళహస్తి: పట్టణంలోని బాబు అగ్రహారం కూడలి వద్ద సోమవారం నవభారత్ యువజన సంఘం చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేసింది. అధ్యక్షులు గరికపాటి రమేష్‌బాబు, న్యాయవాది రాజేశ్వరరావు మాట్లాడుతూ, పట్టణంలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, ఉంగరాల మునెయ్య, వాసుయాదవ్, ఢిల్లీకుమార్, గాంధీ, యేసు పాల్గొన్నారు.

ఘనంగా మేడే

శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో మరింత కోలాహలంగా సంబరాలతో హోరెత్తించారు. కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని, కార్పొరేట్ సంస్థలకు దాసోహమంటోందని కార్మిక నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటిత పోరాటంతో హక్కులు సాధించుకుంటామని నినదించారు.


శ్రీకాళహస్తిరూరల్ : వైఎస్సార్‌టీయూసీ జెండా ఆవిష్కరణలో బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి రూరల్: కార్మికులంతా ఐక్యంగా ఉండి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించుకోవాలని వైఎస్సార్‌టీయూసీ గౌరవాధ్యక్షురాలు బియ్యపు పవిత్రా రెడ్డి అన్నారు. సోమవారం మే డే సందర్భంగా శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి సమీపంలో ఉన్న కోకా–కోలా పరిశ్రమలో పనిచేస్తున్న వైఎస్సార్‌టీయూసీ కార్మికులు ఏర్పాటు చేసిన జెండాను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. 138 ఏళ్ల క్రితం 1886 మే 1న అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటలు పని దినం కోసం కార్మికులు కదం తొక్కారని, వారిపై అమెరికా పోలీసులు తూటాల వర్షం కురిపించడంతో ఆరుగురు కార్మికులు అమరులయ్యారని, వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ ప్రతి ఏటా మే డే జరుపుకుంటున్నట్లు చెప్పారు. పరిశ్రమలు లాభాల బాటలో పయనించాలంటే కార్మికుల బాగోగులు చూసుకోవాలన్నారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, స్కీం వర్కర్లను పర్మినెంట్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి భారతి విజ్ఞప్తి చేశారు. మండలంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మేడే ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎర్రజెండాను ఆవిష్కరించి అమరులైన వీరులకు జోహార్లు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు, అదాని, అంబానీ లాంటి వారి ఆస్తులు వేలకోట్లు చేరడానికి రెడ్ కార్పెట్ పరుస్తోందని విమర్శించారు. మేడే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దుచేయడం దుర్మార్గమని నిరసించారు. అనంతరం తొట్టంబేడు ఐసీడీఎస్ కార్యాలయం నుంచి వీఎంసీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తొట్టంబేడు అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శోభ, అధ్యక్షురాలు ప్రమీల, మహిళలు, కార్మికులు పాల్గొన్నారు.

రేణిగుంట మండలంలో..

రేణిగుంట:మండలంలోని గాజులమండ్యం ఆయిల్ ఫ్యాక్టరీ కూడలి వద్ద మాతమ్మ ఆటోస్టాండ్ కార్మికులు నిర్వహించి మేడే వేడుకల్లో ముఖ్య అతిథులుగా ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, గాజులమండ్యం సర్పంచ్ గంగారి రమేష్ మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి జగనన్న ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. గురవరాజుపల్లెలో సర్పంచ్ షైనాజ్‌బీ, రహీం జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, సీపీఎం మండల కార్యదర్శి నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరమణ ఆధ్వర్యంలో పలు కార్మిక వాడల్లో మేడే జెండా ఆవిష్కరించారు. రేణిగుంట నంది పాలిమర్స్ వద్ద యూనియన్ అధ్యక్షుడు రామిరెడ్డి, ఆయిల్ ఫ్యాక్టరీ వాల్టర్స్ కంపెనీ వద్ద యూనియన్ కార్యదర్శి జయరామిరెడ్డి, మల్లాది డ్రగ్స్ కర్మాగారం వద్ద అధ్యక్షుడు మునిక్రిష్టారెడ్డి, రేణిగుంట చెక్‌పోస్ట్ జీసెస్ ఆటోస్టాండ్ వద్ద యూనియన్ కార్యదర్శి శేఖర్, కొత్త చెక్‌పోస్ట్ అంకాళమ్మ ఆటో స్టాండ్ వద్ద యూనియన్ కార్యదర్శి సుబ్బరాయులు, సీడబ్ల్యూసీ గోడౌన్ వద్ద హమాలీ మేస్త్రీ శివ, రేణిగుంట పంచాయతీ పారిశుధ్య కార్మికుల యూనియన్ కార్యదర్శి కృష్ణమూర్తి మేడే సంబరాలు నిర్వహించారు.

కార్మిక నాయకులకు సన్మానం

తారకరామానగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు మన్యం శ్రీనివాసులురెడ్డి.. ఏఐటీయూసీ తారకరామనగర్ కార్యదర్శి రజాక్ బాషా, మోహన్, డివిజనల్ సెక్రటరీ వైఎస్ మణి, గోవిందు, వినయ్‌కుమార్‌రెడ్డి, తరుణ్, కుమార్‌రెడ్డి, లాజరస్, నాగూర్ బాషా తదితరులను ఆయన శాలువాలతో సత్కరించారు.

అన్నదానం

ఏపీ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జి.3045 నాయకులు రేణిగుంట అక్షయ క్షేత్రంలోని దివ్యాంగులకు అన్నదానం చేశారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బాలునాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనియన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్, జిల్లా ట్రెజరర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద గణపతి ఆటో యూనియన్, అశోక్‌నగర్‌లో సీపీఎం నాయకులు రంగయ్య, వెంకటేశ్వరరావు, సీతారాంపేట సమీపంలోని ఎఫ్‌సీఐ గోదాము వద్ద హమాలీలు, పాపానాయుడుపేట బస్టాండులో బిల్డింగ్ వర్కర్స్, సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు కరీముల్లా, రాజేంద్ర, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.


తొట్టంబేడు : ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు


రేణిగుంట: తారకరామానగర్‌లో కార్మికులకు సన్మానం


ఏర్పేడులో..


రేణిగుంట: గాజులమండ్యం ఆయిల్ ఫ్యాక్టరీ వద్ద..

సత్యవేడు నియోజకవర్గం

సత్యవేడు: సమస్యల పరిష్కారానికి సంఘాలు పటిష్టంగా ఉండాలని ఎస్‌ఐ పురుషోత్తం రెడ్డి అన్నారు. ఎన్‌జీఓ అతిథి భవనంలో నిర్వహించిన మేడే వేడుకల్లో ఆయన మాట్లాడారు. స్థానికంగా ఐదు ప్రాంతాల్లో జెండాలు ఆవిష్కరించారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఎం.రమేష్, కార్మికుల సంఘం అధ్యక్షుడు ఆర్.బాబు, పన్నీరు, హరి, వెంకటేష్, షణ్ముగం, ఇంద్ర, మంజుల, భువన, చందామరి, తిరుమలై రెడ్డి, బాబు, బాలసుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: స్థానిక బస్టాండ్ ఆవరణలో సీఐటీయూ జిల్లా నాయకులు నాగరాజు, నియోజకవర్గ నాయకులు ధనంజయులు, మండల అధ్యక్షురాలు శాంతి 137వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం నిర్వహించారు. అలాగే డైనమిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించి వేడుకల్లో ఆ సంస్థ ప్రతినిధులు బొప్పన శ్రీనివాసులు, నాగప్రసాద్, బాలకృష్ణ, మాడస్వామి తదితరులు ఆటో డ్రైవర్లు, కూలీలకు స్వీట్లు పంపిణీ చేశారు.

బత్తలవల్లంలో..

బత్తలవల్లంలోని గ్రామ సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యదర్శి ఓడూరు ఉజ్వల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకల్లో పంచాయతీ పారిశుధ్య కార్మికులను సత్కరించడంతోపాటు వారికి యూనిఫాం దుస్తులను వితరణగా అందజేశారు. పంచాయతీ కార్యదర్శి పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కత్తి రవి, కత్తిధర్మయ్య ఆధ్వర్యంలో సీపీఐ జెండాను, సీపీఎం మండల నాయకులు నలుగురి రమణయ్య, బాలగురవయ్య ఆ పార్టీ జెండాను ఎగురవేశారు. నాయకులు కృష్ణయ్య, దాసు, చుక్కలింగం, శీను, సుబ్రమణ్యం, వెంకటయ్య, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు, నాగలాపురంలో..

పిచ్చాటూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండులో మండల ఏఐటీయూసీ అధ్యక్షులు సుభాష్ రెడ్డి, వామపక్ష నాయకులు కార్మిక జెండా ఆవిష్కరించారు. నాగలాపురంలో ఏఐటీయూసీ అధ్యక్షులు మురుగేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్మిక సంఘం నాయకులు విజయన్, యాగన్, జగన్నాధం, ఖాదర్ బాయ్, జానకిరామన్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణవనంలో..

నారాయణవనం: హమాలీలకు గుర్తింపు కార్డులను సీఐటీయూ జిల్లా నాయకులు జనార్ధన్ అందజేశారు. రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాల అర్హత కోసం 300 యూనిట్ల నుంచి మరమ్మగ్గ కార్మిక కుటుంబాలను మినహాయించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ నాయకులు గిరిధర్, మునిశంకర్, హమాలీ యూనియన్ నాయకులు నాగరాజు, రాజేంద్ర, ఆర్ముగం, వెంకటేష్, మరమ్మగ్గ కార్మికులు షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.


సత్యవేడు : మాట్లాడుతున్న ఎస్‌ఐ పురుషోత్తం రెడ్డి


వరదయ్యపాళెం : బత్తలవల్లంలో యూనిఫాం పంపిణీ


నారాయణవనం : హమాలీలకు కార్డుల పంపిణీ


బుచ్చినాయుడుకండ్రిగలో..


నాగలాపురం బస్టాండులో..

లోకోస్ యాప్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఏపీఎం ఇందిరమ్మ


సత్యవేడు : మాట్లాడుతున్న ఏపీఎం స్వర్ణలత

బుచ్చినాయుడుకండ్రిగ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోకోస్ ప్రజా యాప్‌లో మండలంలోని మహిళా సంఘ సభ్యులందరినీ చేర్పించాలని ఐకేపీ ఏపీఎం ఇందిరమ్మ కోరారు. సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఆమె సంఘమిత్రలకు లోకోస్ యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మండలంలో 9,025 మంది మహిళ సంఘ సభ్యులున్నారని, వీరందరినీ లోకోస్ ప్రజా యాప్‌లో చేర్పించడం వల్ల దేశంలో ఎక్కడి నుంచైనా లావాదేవీలు నిర్వర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో సీసీలు జగదీష్, జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడులో..

సత్యవేడు: మండలంలోని సంఘమిత్రలు కంప్యూటర్ నిర్వహణపై అవగాహన పెంచుకుని లోకోస్ యాప్‌ను సమర్థవంతంగా వినియోగించేలా ఉండాలని ఏపీఎం స్వర్ణలత కోరారు. యాప్‌పై నాలుగు రోజుల శిక్షణ సోమవారం ముగిసింది. ఏపీఎం మాట్లాడుతూ లోకోస్ యాప్ నిర్వహణ విధానంలో సంఘమిత్రలు సమగ్రంగా సమాచారం పొందుపరచాలన్నారు. భారత దేశం అంతా ఒకే యాప్‌లో స్వయం సహాయక సంఘాల వివరాలు ఉండేలా కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను రూపకల్పన చేసిందన్నారు. సంఘాల వివరాలు, ఆర్థిక లావాదేవీల జమ, ఖర్చుల వివరాలు నమోదు చేయాలన్నారు. 23వ తేదీ లోపు ఎస్సీ, ఎస్టీ నూతన సంఘాల నమోదు చేయాలన్నారు. కొత్త సంఘాల్లో సభ్యులు చేరిక, బ్యాంకు అకౌంట్లు ప్రారంభం, ఆగిన సంఘాల పునరుద్ధరణ పనులు గడువు లోపు ముగించాలన్నారు. సంఘాలలో ఎవరైనా మృతి చెంది ఉంటే వారి పేర్లు తొలగించాలని, కొత్త వారిని చేర్చుకుని వారి వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీసీ పయణి, శిక్షకులు లోకేశ్వరి, రేవతి, శివమ్మ, రాజేశ్వరి, అకౌంటెంట్ నందిని, సంఘమిత్రలు పాల్గొన్నారు.

రథోత్సవంలో అగస్త్యేశ్వరుడు


రథోత్సవంలో అగస్త్యేశ్వరస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో సోమవారం రాత్రి ఉత్సవమూర్తులు రథోత్సవంలో భక్తులను అనుగ్రహించారు. ఆలయానికి చెక్క రథం లేకపోవడంతో సర్వభూపాల వాహనంలో ఉత్సవమూర్తులకు రథోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య కైంకర్యాలను పూర్తి చేశారు. ఉదయం 10.30 గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. స్థానిక ఆలయాల ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, జమేదార్ విజయకుమార్ తదితరులు పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాలలో మంగళవారం సాయంత్రం మరగదవల్లీ, అగస్త్యేశ్వరస్వామికి నిర్వహించే ఆర్జిత కల్యాణంలో రూ 500 చెల్లించి దంపతులు పాల్గొనవచ్చని, అలాగే రాత్రి అశ్వవాహన సేవలో ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తామని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు.

భక్తిప్రపత్తులతో ధ్వజారోహణం


ధ్వజారోహణ కార్యక్రమంలో అర్చకులు, పాలక మండలి సభ్యులు, అధికారులు


స్వామి అమ్మవార్లు

శ్రీకాళహస్తి రూరల్: మండలంలో ఊరందూరులోని శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలు కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలక మండలి సభ్యులు సుమతి, శ్రీకాళహస్తీశ్వరాలయం అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం అవసరం


వైద్యపరీక్షలు చేయించుకుంటున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: అందరికీ ఆరోగ్యం అవసరమని.. ముఖ్యంగా పురపాలక సంఘ కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పట్టణ ప్రజలు కూడా ఆరోగ్యంగా ఉంటారని బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. కార్మికుల దినోత్సవం పురస్కరించుకుని మున్సిపల్ కార్యాలయంలో ప్రెస్‌క్లబ్, ఎంజీఎం ఆస్పత్రి సంయుక్తంగా సోమవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించాయి. దాదాపు 150 మందికి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య బాధ్యత పారిశుద్ధ్య కార్మికులు తీసుకుంటున్నపుడు వారి ఆరోగ్యం గురించి మనం పట్టించుకోవాలన్నారు. కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారన్నారు. స్థానిక కార్మికులకు ఏ కష్టం వచ్చినా ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్, ఆర్డీఓ రామారావు, కమిషనర్ బాలాజీ నాయక్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కామేష్, సీనియర్ పాత్రికేయులు రమణ, వీసీ వెంకటయ్య, వెంకటేష్, హరిబాబు, చక్రపాణి, మునిచంద్ర, చంద్ర శేఖర్, ఎంజీఎం వైద్యులు, పురపాలకసంఘ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

శ్రీకాళహస్తి రూరల్: స్కూళ్లకు వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థుల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి ఏటా మే నెలలోనే ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయని, ఎక్కువగా ద్విచక్ర వాహనాలు నడుపుతూ పిల్లలే ప్రధానంగా ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పిల్లలకు బైక్‌లు ఇవ్వరాదన్నారు. ఆసక్తి ఉంటే డ్రైవింగ్ మీద పట్టు ఉన్నవారి సాయంతోనే డ్రైవింగ్ నేర్చుకోవాలని హితవు పలికారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే శిక్షలు తప్పవని హెచ్చరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించరూ!

- ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రజల వినతి
- ఇందిరానగర్‌లో కొత్త తాగునీటి బోరును ప్రారంభించిన ఎమ్మెల్యే


నాగలాపురం రాజీవ్ నగర్‌లో లబ్ధిదారురాలికి పథకాల లబ్ధి బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: నవరత్నాల పథకాలతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సోమవారం నాగలాపురం సచివాలయం –1 పరిధిలోని ఇందిరానగర్, రాజీవ్ నగర్, సంజీవనగర్ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. వలంటీర్ల వ్యవస్థతో ప్రభుత్వ పథకాలు నేరుగా అర్హుల ఇళ్ల ముంగిటకే చేరుతున్నాయన్నారు. అనంతరం రాజీవ్ నగర్‌లో మేడే వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని, కేక్ కట్ చేసి, కార్మికులకు పంచారు. ఇందిరా నగర్‌లో రూ.2.5 లక్షలతో నూతనంగా వేసిన బోరును ఎమ్మెల్యే స్విచ్ఛాన్ చేసి ప్రారంభించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

రాజీవ్ నగర్, ఇందిరానగర్‌లో తాగునీటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు నివేదించారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ సచివాలయానికి మంజూరయ్యే రూ.20 లక్షల నిధులతో దాహార్తి సమస్యలను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు. మరికొందరు ఇళ్ల స్థలాలు, జగనన్న ఇంటి పట్టాలు, పక్కా గృహాలు, పెన్షన్ మంజూరు చేయాలని విన్నవించారు. వీధులకు సిమెంటు రోడ్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్‌ఆర్‌సీపీ కన్వీనర్ అపరంజిరాజు, సర్పంచ్ సుధ, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, ఎంపీడీఓ పద్మజ, తహసీల్దారు ప్రసన్నకుమార్, సర్పంచులు, ఏఎంసీ డైరెక్టర్లు కులశేఖర్ రెడ్డి, వైఎస్‌ఆర్‌టీయూసీ నియోజకవర్గ చైర్మన్ ఎస్‌ఎం సురేష్, నాయకులు మహేష్ రెడ్డి, శ్యామ్, డానియేల్, మురళి, దేశప్పన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


నాగలాపురం ఇందిరానగర్‌లో తాగునీటి బోరుబావిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

శభాష్ వలంటీర్లు


ఏర్పేడు : చెంచమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్


బుచ్చినాయుడుకండ్రిగ మండలంలో..

ఏర్పేడు: అనారోగ్యంతో వివిధ ప్రాంతాల్లో ఉన్న పింఛనుదారులకు సోమవారం వలంటీర్లు నగదు పంపిణీ చేశారు. మండలంలోని బండారుపల్లెకు చెందిన చెంచమ్మ(61)అనారోగ్యంతో కొన్ని రోజులుగా తిరుపతిలోని చింతలచేనులో తమ కుమార్తె వద్ద ఉంటోంది. వలంటీర్ లత అక్కడకు వెళ్లి పెన్షన్ అందజేసింది. అలాగే అంజిమేడుకు చెందిన కాళయ్య(65) మూత్రపిండాల ఆపరేషన్ చేసుకుని తిరుపతి రుయాలో ఉంటున్నారు. వలంటీర్ మల్లిఖార్జున్ అక్కడికి వెళ్లి వేలిముద్రలు తీసుకుని నగదు అందజేశారు. అవసరమైన సమయంలో పింఛను ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు.

పింఛన్ల అందజేత

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో సోమవారం వలంటీర్లు వృద్ధులు, వికలాంగులు, వితంతువుల ఇళ్లకు వెళ్లి పింఛన్ల నగదు అందజేశారు. ఆలత్తూరు. కంచనపుత్తూరు, కల్లివెట్టు, కుక్కంబాకం, జీఎస్‌కండ్రిగ గ్రామాల కార్యదర్శులు ఇందిరమ్మ, మునికృష్ణ, శివకుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో సాయంత్రంలోపు 96 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. ప్రతినెలా ఇంటికి వచ్చి పింఛన్లు ఇవ్వడంపై పింఛనుదారులు సంతోషం వ్యక్తం చేశారు.